
ప్రజాశక్తి
ఆదివారం 2 నవంబర్ 2025
5
విజయనగరం





ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై పోలీసుల దాష్టీకం

వివరాలు మెయిన్‌లో

సం'క్షామ' వసతిగృహాలు

జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు.. సం'క్షామ' వసతి గృహాలుగా మారుతున్నాయి. నిరుపేద విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో అరకొర వసతుల మధ్య చదువులీడుస్తున్న దుస్థితి నెలకొంటోంది. వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యశించాలని ఎంతో ఆశతో వీటిలో చేరుతున్న పేద విద్యార్థులను సంక్షేమ వసతి గృహాలు వెక్కిరిస్తున్నాయి. జిల్లాలోని చాలా వసతిగృహాలకు సరైన భవనాలు లేక, సౌకర్యాలు లేక ప్రవేశాలు సైతం ఏటా తగ్గిపోతుయాయి. మరోవైపు శిథిలావస్థకు చేరుకున్న వసతిగృహాల్లో ఉండలేక విద్యార్థులు పాఠశాలల్లో చదువుకు స్వస్తి పలికే పరిస్థితి నెలకొంది.

- శిథిల భవనాలు.. ఇరుకు గదుల్లో వసతి
- సరిపడా మరుగుదొడ్లూ కరువే
- తీవ్ర ఇబ్బందుల నడుమ విద్యార్థుల చదువులు



తలుపుల్లేకుండా, పెచ్చులూడిపోయిన గది



పెచ్చులూడిపోతున్న శ్లాబ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు మూడు, కాలేజీ వసతి గృహాలు ఏడు ఉన్నాయి. వీటిలో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాల నగరంలో ఉంది. ఉన్న వాటిలో ఆరు వసతి గృహాలు ఆరు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అరకొర వసతుల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. చాలా వసతిగహాలకు తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. దోమ తెరలు, దుప్పట్లు, పరుపులు, మంచాలు చాలా కాలంగా ప్రభుత్వం ఇవ్వడం లేదు. భవనాలకు సంబంధించి చిన్నపాటి మరమ్మతులు కూడా చేయలేదు. ప్రస్తుతం భవనాలన్నీ అధ్వాన స్థితిలో ఉన్నాయి. విజయనగరం బిసి వసతి గృహంలో 100 మందికి పైగా విద్యార్థులు ఉంటే వారికి కేవలం ఆరు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఉన్న మరుగుదొడ్లకూ కూడా తలుపులు లేవు. మరుగుదొడ్ల లోపలికి వెళ్లాలంటే కంపు కొడుతున్నాయి. గోడలు పెచ్చులూడి, భయానక వాతావరణంలో ఉంది. ఇరుకైన గదులు, చీకటి గదుల్లో ఉంటున్న దయనీయమైన పరిస్థితి నెలకొంది.

అద్దె భవనాల్లో వసతి గృహాలు

వెనుకబడిన కులాల విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాటు చేసిన వసతి గహాలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వం శాశ్వత భవనాలు నిర్మించకుండా అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తోంది. దీంతో ఇరుకైన గదుల్లో ఊడిపోయిన తలుపులుతో వసతి గృహాలు నడుస్తున్నాయి. బిసి బాలురు వసతి గృహం పాత (రాజ్యలక్ష్మి సినిమా హాల్) ఎదురుగా ఉన్నది పాడైన చాలా పురాతనమైన భవనంలో ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లోనూ ఉంది. 25 ఏళ్ల కిందట నిర్మించిన వసతి గృహాలు కావడంతో అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికే కస్పా వీధిలో ఉన్న వసతి గృహాన్ని వేరే చోటకు మార్చారు. నగరంలోని ఆరు కాలేజీ వసతి గృహాల్లో సరిపడా వసతి లేకపోయినా విద్యార్థులు నెట్టుకొస్తున్నారు.

విజృంభిస్తున్న డయేరియా

ఇట్లమామిడిపల్లిలో నలుగురికి వ్యాప్తి ● గ్రామాన్ని సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో అతిసార విజృంభిస్తోంది. ఇటీవల బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో పలువురి దీని బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇంకా అక్కడ వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. తాజాగా శుక్రవారం నుంచి ఇట్లమామిడిపల్లిలో నలుగురు అతిసార బారిన పడి బాడంగి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ గొర్లె మంగ, గంట అప్పలనారాయణ, రాయిపల్లి అచ్చమ్మ, లెంక నారాయణ అతిసార బారిన పడ్డారు. దీనిపై సమాచారం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు శనివారం గ్రామాన్ని సందర్శించారు. అతిసార వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి పథకాలను వెంటనే క్లోరినేషన్ చేయాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. అతిసారను అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇఒపిఆర్‌డికి మెమో

మండలంలో మూడు పంచాయతీల్లో అతిసార ప్రబలడంతో ఇఒపిఆర్‌డి వెంకటరమణకు అధికారులు మెమో జారీచేశారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు కృషి చేయడంలో అలసత్వం, సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు చేరవేయకపోవడం వంటి కారణాలతో మెమో జారీ చేసినట్టు తెలిసింది.



ఇట్లమామిడిపల్లిలో పర్యటిస్తున్న డిపిఒ మల్లికార్జునరావు

అతిసార రోగులకు శంబంగి పరామర్శ

ఇట్లమామిడిపల్లి గ్రామ అతిసార రోగులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం బాడంగి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అతిసార సోకడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదుపునకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైసిపి మండల నాయకుడు ఏకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రతీ ఆడపిల్లా చదువుకోవాలని పిలుపునిచ్చారు. బొండపల్లి, గజపతినగరం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ముందుగా బొండపల్లి మండల కేంద్రంలోని తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. సుమారు రూ.125.40 కోట్ల అంచనా వ్యయంతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. అనంతరం రూ.1.92 కోట్లతో దేవుపల్లిలో నిర్మించిన కెజిబివి హాస్టల్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీలో భాగంగా రూ.15.58 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. రూ.43లక్షల అంచనాతో కెజిబివిలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యతాంశమని అన్నారు. దానిలో బాలికా విద్యకు మరింత ప్రోత్సాహం, ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కెజిబివి భవనం 2019 నాటికే పూర్తయినప్పటికీ, కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.15లక్షలు వెచ్చించి చిన్నచిన్న మరమ్మతులను చేయించి ప్రారంభిస్తున్నామని చెప్పారు. క్రీడా సౌకర్యాలను సైతం మెరుగు పరుస్తున్నామని చెప్పారు. అన్ని రంగాల అభివృద్ధి పట్లా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కెజిబివిలు బాలికలకు వరంగా మారాయని అన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎఎంసి చైర్మన్ పి.గోపాల్‌రాజు, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరాజు, డిఇఒ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు, టిడిపి మండల అధ్యక్షులు రాపాక అచ్చంనాయుడు, మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కంటోన్మెంట్‌లో వికలాంగురాలు వారణాసి పద్మావతికి పింఛను డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఉన్నారు. అనంతరం డిఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి పింఛన్ల పంపిణీని కలెక్టర్ పర్యవేక్షించారు.

17 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 17 నుంచి 30 వరకు జిల్లాలో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలు, సామాజిక మచ్చ వల్ల కొంతమంది ముందుకు రావడం లేదని తెలిపారు. అటువంటి అపోహలను విడనాడి ఎవరైనా చర్మంపై తెల్లటి మచ్చలు, ఎర్రటి వాపు, గడ్డలు లేదా సున్నితత్వం కోల్పోవడం వంటి లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సర్వే నిర్వహించి అనుమానితులను గుర్తించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

1790 బృందాలతో ప్రతి ఇంటిలో వయస్సుతో సంబంధం లేకుండా ఉన్న వారందరినీ పరిశీలించి, అనుమానిత లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్య బృందాలకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ కె.జీవన రాణి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి కె.రాణి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, డిపిఆర్ఒ గోవిందరాజులు, ఐసిడిఎస్ పిడి విమల రాణి, మెప్మా పీడీ చిట్టిబాబు, డిపిఎం సూర్యనారాయణ, జిల్లా ఎపిడిమాలజిస్ట్ డా. సత్యనారాయణ, డిఎన్ఎంఒ అర్చన, డిస్ట్రిక్ట్ ఆశా కోఆర్డినేటర్ బి.మహాలక్ష్మి, విద్యాశాఖ ఎడి, తదితర అధికారులు పాల్గొన్నారు.



తల నరికేయడంతో పడిఉన్న గోవింద మృతదేహం

మద్యం మత్తులో తండ్రి పీక కోసిన కసాయి

గొల్లాదిలో దారుణం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని గొల్లాది గ్రామంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో కన్న తండ్రి పీక కోసి హత్యచేశాడు కసాయి కొడుకు. ఈ సంఘటన శనివారం మండలంలో తీవ్ర కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గొల్లాది గ్రామానికి చెందిన మామిడి గోవింద (సత్యం) (62) పక్షవాతం వ్యాధితో మంచానికి పరిమితమయ్యాడు. గోవిందకు ఇద్దరు కుమారులున్నారు. గతంలోనే ఆయన భార్య మరణించింది. చిన్న కుమారుడు రాము శనివారం పదునైన కత్తితో గోవిందపై దాడి చేశాడు. పీక కోసి, శరీరం నుంచి తలను వేరు చేశాడు. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. హత్య ఎందుకు చేశాడో వివరాలు తెలియాల్సి ఉంది. రాము మద్యం తాగితే సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్తులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేస్తున్నారు.

మన్యం వద్దు.. విజయనగరమే ముద్దు

స్వార్థ రాజకీయాలు చేయొద్దన్న వైసిపి

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ మండలాన్ని మన్యం జిల్లాలో కలపొద్దని, విజయనగరం జిల్లాలోనే కొనసాగించాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైసిపి నాయకులు విలేకరులతో మాట్లాడారు. గతంలో విజయనగరం జిల్లాలో మెంటాడ మండలాన్ని ఉంచాలని అన్ని పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టామని గుర్తుచేశారు. అప్పట్లో వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ మండల ప్రజల ఇబ్బందులు, మనోభావాలు గుర్తించి జిల్లా మంత్రుల సహకారంతో విజయనగరం జిల్లాలో కొనసాగాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ మండల నేతలు స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. మెంటాడ మండల వాసులు మన్యం జిల్లా పార్వతీపురం వెళ్లాలంటే వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇతర పార్టీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెరవెనుక రాజకీయం చేయవద్దని హితవుపలికారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి లెంక రత్నాకర్ నాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, పిట్టాడ సర్పంచ్ కాపారపు పైడిపునాయుడు, వైసిపి సీనియర్ నేత రెడ్డి రాజప్పల నాయుడు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న ప్రజలు, యువత, విద్యార్థులు

కొవ్వొత్తుల ర్యాలీ

మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో కొనసాగించాలని కోరుతూ శనివారం రాత్రి మెంటాడ యువత కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మన్యం జిల్లా వద్దు.. విజయనగరం జిల్లా ముద్దు.. అంటూ నినాదాలు చేశారు. మన్యం జిల్లాలో మెంటాడ మండలాన్ని కలుపుతారనే ప్రచారం సోషల్ మీడియాలో రావడంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారని యువకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రయివేటు ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో నిర్వాహకులకు సూచించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ప్రాణనష్టం సంభవించడంతో ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దేవాలయ నిర్వాహకులకు సూచించారు. పండుగలు, జాతరల సమయంలో తగిన భద్రతా చర్యలు, బారికేడ్లు, క్యూలైన్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాల్లో ఉన్న ఆలయాలు, ఏడాదిలో జరిగే ఉత్సవాలు, హాజరయ్యే యాత్రికుల సంఖ్య, గతంలో జరిగిన దుర్ఘటనలు తదితర అంశాలతో సర్వే చేసి నివేదిక అందించాల్సిందిగా రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి కంటోన్మెంట్

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇళ్ల నిర్మాణాలకు ఈ నెల ఐదో తేది వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని గృహనిర్మాణ సంస్థ డిఎం జి.మురళీమోహన్ తెలిపారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్థలమున్న వారికి అక్కడే ఫొటో తీసి ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు. ఫొటో తీసిన వారం రోజుల్లో బిల్లు చెల్లిస్తారని తెలిపారు. పునాదులకు రూ.60 వేలు, లెంటల్ లెవల్ రూ.60 వేలు, స్లాబ్‌కు రూ.60 వేలు, ఇల్లు పూర్తి చేశాక రూ.70 వేలతోపాటు ఉపాధి హామీ కింద రూ.27 వేలు అదనంగా చెల్లిస్తారని తెలిపారు. ఇంటి లబ్ధిదారులకు మొత్తంగా రూ.2,89,000 అందిస్తారని తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 111 ఇళ్లకు సర్వే చేసినట్లు చెప్పారు.

ఔషధ నియంత్రణ శాఖ డిడిగా రజితకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్



విజయనగరం జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రజితకు విశాఖపట్నం జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 నుంచి ఆమె విజయనగరం జిల్లాలో ఎడిగా విధులు నిర్వహిస్తున్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి

సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు



మాట్లాడుతున్న జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-డెంకాడ

యువ పరిశోధకులు సృజనాత్మకంగా ఆలోచించి, మానవాళికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేయాలని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. లెండి కళాశాలలో ఎఐసిటిఎ-2025 జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యుగంలో కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కంప్యూటింగ్ వంటి సాంకేతికతలు జీవన విధానాన్ని, పరిశ్రమలను, విద్యను, సమాజాన్ని పూర్తిగా మారుస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధస్సు వినియోగంలో నైతిక విలువలు, బాధ్యతా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ రాజేంద్ర పాముల మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.వి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వి.అంజి రెడ్డి, హరిబాబు తమ్మినేని, డీన్లు జి.ప్రకాశ్ బాబు, బి.వి.ఎస్.ఆచార్యులు, కె.వై.వసంత్, విభాగాధిపతులు కె.సుబ్బరామయ్య, సతీష్ పూజారి, రామారావు, రాజేంద్ర, డి.నరేష్, వి.ప్రసాద్, పి.జె.వర్మ, పి.డి.శైలజ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ ఒకటో తేదిని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని ఎపి అంబేద్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బుంగ భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది నుంచి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించక పోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఇదే డిమాండ్‌తో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మల్లాన సత్యనారాయణ, దారాన వెంకటేష్, లోపిటి రామకృష్ణ, వేముల వంశీ, డోల కోటేశ్వరరావు, అన్వర్, ఉమామహేశ్వరరావు, వంక చిన్నికృష్ణ పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న సిపిఎం నాయకులు శంకర్రావు

ఆదర్శం.. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం


ప్రజాశక్తి-బొబ్బిలి

కేరళలో సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం పేదరికం లేని రాష్ట్రంగా నిలిపి, దేశానికి, ప్రపంచానికి మంచి సందేశాన్ని ఇచ్చిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు అన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా కేరళ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బొబ్బిలిలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలన సంస్థలు, కుటుంబశ్రీ, లైఫ్ మిషన్, ఆరోగ్యం, ఇతర ప్రభుత్వ విభాగాల మద్దతుతో దేశంలోనే పేదరికం లేని రాష్ట్రంగా కేరళ అవతరించిందని చెప్పారు. ఇది వామపక్ష ప్రభుత్వం సాధించిన గొప్ప విజయమని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కేరళకు ఎన్ని రకాలుగా ద్రోహం చేసినా, నిధులు ఇవ్వకపోయినా కేరళ ప్రజలు, వామపక్ష ప్రభుత్వం ఒక్కటై ఆ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం, ఉడముల ప్రసాద్, బి.యుగంధర్, కమలమ్మ, పి.అప్పారావు పాల్గొన్నారు.

పరిహారం రాబడితే పనిచేసినట్టు లెక్క

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మొంథా తుపానుతో నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాలు, వీచిన గాలులకు జిల్లాలో భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది బాగా పండిందనుకున్న సమయానికి తుపాను దెబ్బతీసింది. సోమ, మంగళ, బుధవారాల్లో తుపాను పట్ల ప్రజల్ని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో కలెక్టర్ రామసుందరరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సఫలమయ్యారు. కానీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు చెప్తున్నట్టు తుపాను ఆపేయడం, నష్టాన్ని నివారించేయడం అంటే అది అతిశయోక్తే. ఉన్నంతలో నష్టాన్ని తగ్గించేందుకు కృషిచేశారు. మంత్రి, కలెక్టర్ కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్ర స్థాయికి వెళ్లడం అభినందనీయం. దీంతో చాలావరకు వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి వరకు వెళ్లడం కనిపించింది. అప్పటికీ కదలకుండా బాధ్యతా రహితంగా వ్యవహరించిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవడం కూడా అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చింది. ఎంత ప్రయత్నించినా, భారీ వర్షాలు, పెనుగాలులకు జిల్లా వ్యాప్తంగా 110.78 కోట్లు నష్టం వాటిల్లింది. ఇంకా వ్యవసాయ, ఉద్యాన శాఖల నష్టం తేలాల్సి ఉంది. ఎందుకంటే, పంటపొలాల్లో చేరిన నీరు ఇంకా బయటకు రాలేదు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల కథనం ప్రకారం... జిల్లాలో 6,904 ఎకరాల మేరకు పంట నష్టం వాటిల్లింది. ఇందులో 10 ఎకరాల ఉద్యాన పంటలు, మిగిలిన విస్తీర్ణం వ్యవసాయ పంటలు ఉన్నాయి. ఇందులోనూ



అత్యధికంగా వరి ఉంది. పలుచోట్ల కోతదశ, మరికొన్నిచోట్ల పొట్టదశలో ఉన్న వరిచేలు నీటమునిగాయి. మొక్కజొన్న, పత్తి, తదితర పంటలు కూడా దెబ్బ తిన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదటి నుంచీ వర్షాలు అనుకూలించడంతో పంటలన్నీ సకాలంలోనే పడ్డాయి. గత నెలల కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న దిగుబడి తగ్గింది. తాజాగా వచ్చిన మొంథా తుపాను మరింత నాశనం చేసింది. చేతికి అందిన మొక్కజొన్న, పత్తి కూడా నాశనమైంది. సరిగ్గా వెన్నుపొడిచే సమయంలో వచ్చిన తుపానును వరిచేను తట్టుకోలేకపోయింది. వేలాది ఎకరాలు మునిగిపోవడం, నేలమట్టం కావడంతో భారీ నష్టమే వాటిల్లింది. నిర్దిష్టమైన అంచనాలు ఇంకా వేస్తున్నామని వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గతుకులమయంగా మారిన రహదారులు తుపాను దెబ్బతో అస్తవ్యస్తంగా మారాయి. ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని సుమారు 180 కిలోమీటర్ల పరిధిలో రహదారులు దెబ్బతిన్నట్టు ఆయా శాఖల అధికారులు అంచనా వేశారు. వీటి వల్ల సుమారు రూ.79.66 కోట్ల మేర నష్టం జరిగిందని చెప్తున్నారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 184 చిన్ననీటి వనరులు దెబ్బతినగా రూ.23.43 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. 90 ఇళ్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సబ్‌స్టేషన్లు, పశువుల శాలలు దెబ్బతిన్నాయి. ఇలా చాలా రంగాల్లో నష్టాలు జరిగాయి. వీటిపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడంతోపాటు అందుకు తగ్గట్టు నష్టపరిహారం వచ్చే విధంగా జిల్లా కలెక్టర్, మంత్రి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సి ఉంది. ఇలా పరిహారం రాబట్టినప్పుడే చేసిన పనిచేసినట్టు లెక్క! అంటూ జనం చర్చించుకుంటున్నారు.

జిందాల్ నిర్వాసితులపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులపై ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం నాయకులు చల్లా జగన్ అన్నారు. మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపడుతున్న నిరసన 133వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్ మాయలో పడి సర్వం కోల్పోయిన గిరిజనులు 133 రోజులుగా నిరసనలు చేపడుతుంటే ఎవ్వరూ కూడా కన్నెత్తి చూడకపోవడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-డెంకాడ

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని రఘుమండలంలో వైసిపి మండల అధ్యక్షులు తమ్మినాయుడు ఆధ్వర్యంలో శనివారం సంతకాలు సేకరించారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వల్ల జరిగే నష్టాలను యువకులకు వివరించారు. కార్యక్రమంలో రఘుమండ సర్పంచ్ గూడేం విష్ణుమూర్తి, జొన్నాడ సర్పంచ్ కోటి నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లలిత కోరారు. రెడ్‌క్రాస్ యోగా సెంటర్‌లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాలు వినియోగంతో అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది చందక మన్మథరావు, ఐ బ్యాంకు టెక్నీషియన్ ఎ.రమణ, మహారాజా ఫార్మసీ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలు దాటడం నేరం

ప్రజాశక్తి-బొబ్బిలి

రైలు పట్టాలు దాటడం చట్టరీత్యా నేరమని ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ పిసి పాండా అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం భద్రత, రైలు పట్టాలు దాటడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు దాటడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టాలు దాటితే ఆరు నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా పడుతుందన్నారు. రైలులో ప్రయాణం చేసే సమయంలో నగలు, సామాన్లు భద్ర పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సిహెచ్.ఎం రావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సీతారాం

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సీతారాం తెలిపారు. 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని చెప్పారు. గురుకుల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా బాగా రాణిస్తున్నారని తెలిపారు.

నగరంలో థర్మోప్లాస్ట్ స్పీడ్ బ్రేకర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో స్పీడ్ బ్రేకర్లకు తొలిసారిగా థర్మోప్లాస్ట్ రంగులు అద్దడంతో నూతన శోభతోపాటు భద్రతాపరంగా కొత్త మార్పులు సంతరించుకుంటున్నాయి. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. రామానాయుడు రోడ్డు, శాంతినగర్, ఎస్ఎన్ఎస్ థియేటర్ రోడ్డు తదితర జంక్షన్లలో స్పీడ్‌బ్రేకర్లు థర్మోప్లాస్ట్ రంగులు వేస్తున్నారు. వాహన చోదకుల భద్రత రీత్యా స్పీడ్ బ్రేకర్లు రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించే విధంగా థర్మోప్లాస్ట్ రంగులను వేస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. 30 స్పీడ్ బ్రేకర్లకు ఈ తరహా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



బావిలో క్లోరినేషన్ చేస్తున్న కార్మికులు

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని కావలి పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి రాజేశ్వరరావు, గ్రామ సెక్రటరీ సి.హెచ్.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన రహదారుల ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. బోర్లు, బావుల వద్ద క్లోరినేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అమ్మాన్, మన్నేన రాము పాల్గొన్నారు.

శ్మశానవాటికను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రంలో వల్లంపూడి, వేపాడ దళితులకు శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని ఎంపిడిఒకు దళిత మహాసభ మండల అధ్యక్షులు కొమానపల్లి రాము, రవి, అప్పారావు వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన ఎంపిడిఒ ఆ స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు సౌకర్యం కల్పించి, స్థలానికి హద్దులు నిర్ధారించి, మండల పరిషత్తు సాధారణ నిధులతో సౌకర్యాలు కల్పిస్తామని ఎంపిడిఒ తెలిపారు.

రాముకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చియ్యపుపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పుర్లేటి రామును ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరామర్శించారు. ఇటీవల ఆయనకు శస్త్రచికిత్స జరగడంతో శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పాట్నూరు వెంకట రత్నాజీ, పిఎసిఎస్ ఛైర్మన్ కోళ్ల శ్రీను, డైరెక్టర్ గొంప పోతునాయుడు, సర్పంచ్ మాకేన సీతారాం పాత్రుడు, లెంక శ్రీను, రామ గణేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని లోతుగెడ్డ పంచాయతీలోని పోరువు బాడకు చెందిన నిరుపేద గిరిజన మహిళకు ఎస్‌ఐ కె సీతారాం నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేశారు. ఇటీవల ఆమె కుమారుడు జ్వరం అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆమెకు ఎస్‌ఐ సాయం చేశారు.

వరిపంట రక్షణకు చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల : రైతులు వరిపంట రక్షణకు చర్యలు తీసుకోవాలని ఎ.పి.శ్రీలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి, రైతులకు సూచనలిచ్చారు. వరి పొలాలనుంచి వర్షంతో ఉంటే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలన్నారు. ఎక్కువగా నీరు నిలిచిన చోట పెద్ద కాలువలగా చేసి మోటార్ల ద్వారా బయటకు తరలించాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు

డెంకాడ : డెంకాడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో శనివారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డిప్యూటీ డిఇఒ కెవి రమణ, ఎంఇఒలు బి.చంద్రమౌళి, ఆర్.కృష్ణ పర్యవేక్షించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాలని వారు సూచించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

రాజాం : మండలంలోని కంచరం గ్రామంలో మద్యం అమ్ముతున్న సత్యనారాయణను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ జైభీమ్ తెలిపారు. ఆయన నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సందడిగా పింఛన్ల పంపిణీ



పింఛను నగదు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



భోగాపురం.. పింఛను నగదు అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు




విజయనగరంకోట.. పింఛను నగదు అందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



నెల్లిమర్ల.. పింఛను నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి



బొబ్బిలి.. పింఛను నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన



కొత్తవలస.. పింఛను నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే నాగమాధవి

ప్రజాశక్తి-డెంకాడ

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. శనివారం మండలంలోని గుణుపూరుపేటలో జెజెఎం వాటర్ ట్యాంక్, వెల్నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రం, వ్యవసాయ డ్రోన్ పంపిణీ కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడం, గ్రామాల సమగ్ర అభివృద్ధికి శాశ్వత సదుపాయాలు కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. నీటి, ఆరోగ్య, వ్యవసాయ రంగాల్లో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాసుదేవరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

మత్స్యకారులకు రేషన్ పంపిణీ

పూసపాటిరేగ :మండలంలోని కోనాడలో మత్స్యకారులకు శనివారం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఈజ్జుపు కిరణ్, బొడ్డు ఎల్లాజీ , జనసేన మండల అధ్యక్షులు అప్పడు దొర, బి.విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులే ఎక్కువ

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ప్రజా పాలన కంటే కక్ష సాధింపు చర్యలే ఎక్కువయ్యాయని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు బొడ్డు వాసుదేవరావు వ్యాఖ్యానించారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం తెస్తామని అధికారం చేపట్టిన కూటమి డబుల్ ఇంజిన్ సర్కార్ రైతుల నుండి బలవంతంగా భూములను లాక్కొని కార్పొరేట్లకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. అధికారం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ తదితర హామీలు సూపర్‌ఫ్లాప్ అయ్యాయన్నారు. రాష్ట్రంలో ఎర్రబుక్కు రాజ్యాంగం అమలు చేస్తామని మంత్రులే ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పరస్పరంగా కత్తులు దూసుకొనే అధికార, ప్రతిపక్షం కేసులు భయంతో రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి మోడీ ఆజ్ఞలను అమలు చేయడం దారుణమన్నారు. కడపలో డిసెంబర్ 6,7 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. శంకరరావు, ఎఐసిసిటియు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.అప్పలరాజు, అసంఘటిత రంగ కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బి.గిరిప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు జి.సత్యారావు, ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కోసం పోరాటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో, మోటారు, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు సాధన కోసం పోరాటం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. శనివారం నగరంలోని మార్క్స్ నగర్ (బుచ్చెన్న కోనేరు) జంక్షన్ ఆటో స్టాండ్ వద్ద ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రిక్షా వర్కర్స్ యూనియన్ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి అప్పురుబోతు జగన్నాథం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ మోడీ తెచ్చిన 4 నల్ల లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి సభ్యులు పొందూరు అప్పలరాజు, వెలగాడ రాజేష్, బూర వాసు, వడ్డాది కొండలరావు, పట్నాన గంగులు, పట్నాన రాము, పి.రమేష్, పైడిపాటి వెంకటస్వామి, బుగత అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైతుసంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి



రైతుసంఘం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మెంటాడ

ఈ నెల తొమ్మిదో తేదీన శృంగవరపుకోటలో జరిగే ఎపి రైతుసంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు కోరారు. శనివారం మెంటాడలో ఎపి రైతుసంఘం జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇటీవల తుపాను ప్రభావంతో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండ్రేటి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తుపానుతో వరిపంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. మొంథా తుపాను కారణంగా వరి సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలకు వరిపంట నేలకొరిగి. మొత్తం నాశనమైందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుకి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రామారావు డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాల మార్పు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలో శిథిలావస్థకు చేరుకున్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేసే పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఎఇ వినయ్ మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి తొలగిస్తున్నామని తెలిపారు. కావలి, వాల్తేరు, పనసపేట గ్రామాల్లో ప్రస్తుతం స్తంభాల మార్పు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్‌మేన్లు రామకృష్ణ, టి.గడ్డెన్నాయుడు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి-గుర్ల

గుర్లలోని కెజిబివిని శనివారం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి రమణ మూర్తి సందర్శించారు. ఇటీవల కెజిబివిలో షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కెజిబివిని సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి రమణ, పున్నపురెడ్డి రాంబాబు, జమ్ము రామకృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు యడ్ల సంతోష్, బెవర కూర్మారావు, పున్నపురెడ్డి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.





పొట్టి శ్రీరాములు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వేపాడ ఎంపిడిఒ సూర్యనారాయణ, జెసి రాజు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి ఎంపిడిఒ సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ మహేష్, సీనియర్ అసిస్టెంట్ పైడిరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె.సి.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిసిహెచ్ జి శర్మ, ఎన్ రమేష్, కె.రామకృష్ణ, ఎ.చిన్నారావు, రాజు, యుగంధర్, సోమేశ్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయ సమీపంలో సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖలో తొలిసారిగా జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.ప్రవీణ్, పి.అనిత, ఎన్.వి.రమణ, వై.సుశీల, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలను గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమ గిరిజన నాయకుల గుర్తుగా మొక్కలు నాటారు. మొక్కలను స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల పేర్లు పెట్టి విద్యార్థులకు దత్తతగా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఉమా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ శిబిరాలతో నాయకత్వ లక్షణాలు




మాట్లాడుతున్న సిఐ నారాయణమూర్తి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రత్యేక సేవ శిబిరాల వల్ల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవడతాయని సిఐ నారాయణమూర్తి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా శిబిరాన్ని సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సేవా శిబిరం వల్ల విద్యార్థులు ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఎదుటి వారికి సహాయం చేసే గుణాలు విద్యార్థి దశ నుంచే నేర్చుకోవచ్చునని తెలిపారు. తాను కూడా డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పిఒ చల్లా శ్రీనివాసరావు, హై స్కూల్ హెచ్‌ఎం జగదీశ్వరరావు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు వితరణ



హాకీ స్టిక్‌లతో విద్యార్థులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఇటీవల బిళ్లలవలస ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధి బి.రామరాజు క్రీడా పరికరాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సుచరిత, ఉపాధ్యాయ సిబ్బంది ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిఇటి వి.వి.రమణారావు పాల్గొన్నారు.